క్లుప్తంగా

ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ పంపిణీ



నరసరావుపేట: వేసవిని దృష్టిలో పెట్టుకొని రోడ్లపై నిత్యం విధి నిర్వహణలో ఉండే ట్రాఫిక్ పోలీసులకు చల్లని మజ్జిగ పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. పోలీసులకు మజ్జిగ పాకెట్లు అందజేశారు. శనివారం స్టేషన్ రోడ్డులో హెచ్‌టీ ప్రతినిధి శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వనమా సాంబశివరావు, రెడ్‌క్రాస్ సభ్యులు బత్తుల మురళి, ట్రాఫిక్ సీఐ లోకనాథం, చేగు వెంకటేశ్వరరావు, షేక్ జిలాని మాలిక్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నరసరావుపేటటౌన్: మద్యం, సారాయి సేవించటం వల్ల కలిగే దుష్ప్రభావాలను గుర్తెరిగి వాటికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ కె. సోమయ్య అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు మార్గంలోకి వెళ్లకుండా చదువులో రాణించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎస్ఐ కె. మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాతులూరులో వాహనాల తనిఖీ



నాదెండ్ల: గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు బ్యాంకు సెంటర్‌లో పోలీసులు శనివారం వాహన తనిఖీ నిర్వహించారు. ఎస్సై జి పుల్లారావు, ఏఎస్సై కొండలు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపైకేసులు నమోదు చేశారు. ద్విచక్రవాహనదారులు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, రహదారి నిబంధనలు పాటించాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐదుగురు ఎన్ఈసీ విద్యార్థులు



నరసరావుపేట: జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు యూనివర్సిటీ జట్టుకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల (ఎన్ఈసీ)కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం పేర్కొన్నారు. ఈనెల 23న జేఎన్‌టీయూ కాకినాడ నిర్వహించిన సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్, ఎంపికలలో వీరు ఉత్తమ ప్రతిభ కనబర్చటంలో ఎంపిక చేశారన్నారు. వచ్చే నెల నాలుగు నుంచి ఎనిమిది వరకు నెల్లూరు విక్రమసింహ యూనివర్సిటీ నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు జేఎన్‌టీయూ కాకినాడ జట్టు తరఫున వీరు ప్రాతినిధ్యం వహిస్తారనానారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ ఎం.చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్.కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

సత్తెనపల్లి: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని అమరావతి బస్ స్టాప్ సెంటర్‌లో గల డాక్టర్ వైఎస్ఆర్ శాఖ గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ కె.వాణి శనివారం తెలిపారు. శిబిరంలో కథలు చెప్పడం, చదివించడం, డ్రాయింగ్, జీకేతో పాటు వివిధ అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పహల్గాం ద్రోహులను కఠినంగా శిక్షించాలి

కొవ్వొత్తుల ప్రదర్శన చేసిన నాయకులు, ఆర్యవైశ్య యువజన సంఘం



నరసరావుపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న నాయకులు

నరసరావుపేట: జమ్ము, కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేసి హత్యచేసినందుకు వారికి సంతాప సూచకంగా శనివారం సాయంత్రం పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సత్తెనపల్లిరోడ్డులోని వాసవి కల్యాణ మండపం నుంచి ప్రారంభమై మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. దీనిలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను పట్టుకొని శిక్షించాలని కోరారు. ఇది దేశంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, పలువురు విద్యాసంస్థల ప్రతినిధులు, ఆర్యవైశ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

శావల్యాపురం: కశ్మీర్‌లో పహల్గామ్‌లో జరిగిన ఘటన భారతీయులు అందరు ఖండించాలని మండల బీజేపీ అధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం భారతీయులను మత ఆధారంగా అత్యంత కిరాతకంగా పాకిస్తాన్ ఇస్లాం ఉగ్రవాదులు చంపినందుకు నిరసనగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని హేయమైన చర్య అని అభివర్ణించారు. భారతదేశ చరిత్ర ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ఉండటానికి ఉగ్రవాదాన్ని అంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు యంవీ అప్పారావు, మణికంఠ, మహిళలు పాల్గొన్నారు.

సీపీఎం కొవ్వొత్తుల ప్రదర్శన

నరసరావుపేట: కాశ్మీర్‌లో ఉగ్రదాడులకు నిరసనగా మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ప్రతి ఒక్కరూ ఈ దారుణాన్ని ఖండించాలని, దేశంలో మతసామరస్యం కాపాడాలని కోరారు. నరసరావుపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు ఏపూరి గోపాలరావు, డి.శివకుమారి, షేక్ సిలార్ మసూద్, కామినేని రామారావు, ఆంజనేయనాయక్ పాల్గొన్నారు.

ఉగ్రవాదం సమాజానికి క్యాన్సర్ వంటిది

వినుకొండ : ఇటీవల జమ్మూకశ్మీర్ పర్యాటకులపై విచక్షణ మరచి మానవత్వానికి మచ్చగా ఉగ్రవాదులు సామాన్య ప్రజలైన పర్యాటకులపై దాడులు చేయడం హేయమైన చర్య అని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దగ్గుపాటి వెంకట లింగయ్య అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వినుకొండ ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు నివాళులు తెలుపుతూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం సమాజానికి ఒక క్యాన్సర్ వంటిది దానిని అంతమొందించకుంటే సమాజం వినాశనం చెందుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు



వినుకొండలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉగ్రవాద దాడులు నశించాలి

పాత్రికేయుల కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శనలో జర్నలిస్టులు

చిలకలూరిపేట: మానవత్వానికి విఘాతం కల్పించే ఉగ్రవాదదాడులు నశించాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పి భక్తవత్సలరావు చెప్పారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు ఆత్మశాంతి చేకూరాలని ఏపీయూడబ్ల్యూజే అనుబంధ చిలకలూరిపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై జరిగిన ఇలాంటి దాడులను సభ్యసమాజం హర్షించదన్నారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు సమాజంలో అశాంతిని రాజేసే కుయుక్తులు పన్నేవారిపట్ల ప్రజలు అప్రమత్తంగా మెలిగి ఐక్యంగా తిప్పి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ జిలాని, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అబ్దుల్ సత్తార్, అన్నలదాసు గిరి, పాత్రికేయులు కాట్రు శ్రీనివాసరావు, ఎస్ కె కరీముల్లా, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించండి

నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

చిలకలూరిపేట: బర్లీ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు కోరారు. పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో బర్లీ పొగాకు రైతులకు సంబంధించిన సమస్యల వినతి పత్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు కంపెనీలు రైతులను నమ్మించి మోసగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట దిగుబడి బాగా ఉన్నా వాటిని కొనేవారు లేక సాగుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేసే విధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ బర్లీ పొగాకు రైతుల సమస్యల్ని అసెంబ్లీలో ప్రస్తావించటంతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లటం జరిగిందన్నారు. పొగాకు కొనుగోలుకు ఉన్న అడ్డంకులు, ఇతర అంశాలపై ప్రభుత్వం సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతోందని, త్వరలో సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. సమస్య గురించి ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ మంత్రితో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యతో జనం ఉక్కిరిబిక్కిరి



గణపవరం పశువుల ఆసుపత్రి ప్రాంతం

నాదెండ్ల: రోజు రోజుకు ఎండలు తీవ్రత పెరుగుతుండటంతో చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరౌతున్నారు. దీనికితోడు విద్యుత్ కష్టాలు నెలకొనటంతో సమస్య తీవ్రమౌతుంది. మేజర్‌పంచాయతీ గణపవరం గ్రామంలోని పశువుల ఆసుపత్రి ఏరియాలో తరచూ లో ఓల్టేజీ సమస్యతో సతమతమౌతున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో లో ఓల్టేజీ సమస్య కారణంగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు మొరాయిస్తున్నాయి. ఒక్కో సమయంలో లైట్లు కూడా తక్కువ ఓల్టేజీ కారణంగా కొట్టుకుంటున్నాయి. గతేడాది నుంచి గ్రామంలోని పలు ప్రాంతాల్లో సమస్య నెలకొంది. పలుమార్లు స్థానికులు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకోవటంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామంటూ దిమ్మెనైతే కట్టించారు తప్ప ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదు. అప్పట్లో గ్రామంలో లోఓల్టేజీ సమస్య ఉన్న పలు ప్రాంతాల్లో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం మూడు చోట్లే ఏర్పాటు చేశారు. నాలుగో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవటంతో సమస్య వేధిస్తున్నదని, విద్యుత్ శాఖ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. చిలకలూరిపేట విద్యుత్‌శాఖ ఏడీఏ అశోక్‌బాబు దృష్టికి సమస్య తీసుకెళ్లగా, లోఓల్టేజీ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

బాల్యవివాహాలు అరికట్టి బాలికలను రక్షించుకుందాం



బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం

నూజెండ్ల: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని, వివాహం చేసిన వారితో పాటు ప్రోత్సహించిన వారిని కూడా నేరస్తులుగా పరిగణిస్తారని యపిపి మేడం జయరామిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ జయరామిరెడ్డి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, నివారించటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆడపిల్లలు పుట్టగానే బాధ్యతగా భావిస్తూ చిన్న తనంలో పెళ్ళి చేసి వారిని వదిలించుకోవాలనే దృక్పధం మారాలన్నారు. 18 సంవత్సరాలు నిండని బాలికలుకు వివాహం జరుగుతున్నట్లు స్థానిక ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీస్‌లకు గానీ సమాచారం అందిస్తే చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు, ఐసీడీయస్ సూపర్‌వైజర్లు ఇన్నాసమ్మ, నాగలక్ష్మి, శివనాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జాస్పర్ నాయక్‌కు గిన్నిస్ బుక్‌లో స్థానం



అమరావతి: మండలంలోని పెదమద్దూరుకు చెందిన తేజోవత్ అజోన్ జాస్పర్ నాయక్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో స్థానం లభించింది. అయన విజయవాడలోని హలెల్ మ్యూజిక్ స్కూల్‌లో దండంగి అగస్టీన్ వద్ద కీబోర్డు ప్లేయింగ్‌లో మంచి పట్టు సాధించారు.

ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 1న ప్రపంచవ్యాప్తంగా 18 దేశాలకు చెందిన 3,000 మంది సంగీత ప్రముఖులకు సరళీస్వరాల విభాగంలో నిర్వహించిన పోటీలో ఆంధ్రప్రదేశ్ నుంచి జాస్పర్ నాయక్‌ను గుర్తించి గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు. ఈ నేపథ్యంలో ఈనెల 25న శుక్రవారం విజయవాడలోని మెట్రోపాలిటిన్ చర్చిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నాయక్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు సర్టిఫికెట్‌ను నిర్వాహకులు అందజేశారు.

• భానుడి ధాటికి...



వాహనాలు రద్దీ లేక బోసిన గుంటూరు-కర్నూలు రహదారి మార్గం

భానుడు ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకు వడగాలులు ప్రభావం, భానుడు ఉగ్రరూపం ధాటికి జనం బెంబేలెత్తుతున్నారు. ఇక ఉపాధి పనులు వెళ్లే కూలీలు సైతం ఉదయం 10 గంటలకు పనులు పూర్తి చేసుకుని ఇంటి ముఖం పడుతున్నారు. ఎండధాటికి పనులు వాయిదా వేసుకుంటున్నారు. అత్యవసర పనులు ఉన్నవారు మాత్రం వేసవి జాగ్రత్తలతో బయటకు వస్తున్నారు. గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గంలో నిత్యం వాహనాలతో రద్దీగా ఉండేది. శనివారం భానుడి ధాటికి ఇదిగో.. ఇలా నిర్మానుష్యమై కనిపించింది.

–శావల్యాపురం

28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుండి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు జరుగుతాయని శాఖా గ్రంథాలయాధికారి జి.సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరములు జరుగుతాయన్నారు. ఈ శిబిరాలలో ప్రతి రోజు విద్యార్థులకు కథలు చదివి, వినిపించటం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, క్విజ్, జీకె, ఇతర అంశాలను నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

నాదెండ్ల: గణపవరం గ్రామీణశాఖా గ్రంథాలయంలో ఆదివారం నరసరావుపేట ఎంవీ రెడ్డి ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పీఆర్‌వో దిలీప్ తెలిపారు. డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ సృజన ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి నరసరావుపేటలోని తమ వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్ ద్వారా ఉచితంగా చికిత్సలు చేస్తామని తెలిపారు. ఆధునిక పరికరాలతో కోతలు లేని శుక్లం ఆపరేషన్లు, నీటి కాసులు, కంటి ప్లాస్టిక్ సర్జరీలు, రెటీనాపొర వైద్యసేవలు, కృత్రిమ కన్ను అమర్చుట, చిన్నారుల్లో వచ్చే కంటి సమస్యలు, కంటి దెబ్బలకు చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: బాసట సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం షుగర్, బీపీ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ శిబిరానికి సీనియర్ వైద్యులు లింగమల్ల మోహన్‌భాస్కర్‌తో పాటు ఇతర వైద్యులు హాజరై షుగర్, బీపీ పరీక్షలతో నిర్వహించి రెండు నెలలకు సరిపడ మందులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభను వెలికితీసేందుకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం

యడ్లపాడు: బాసట సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి మొదలై నెలరోజులు పాటు కొనసాగుతాయన్నారు. స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో జరిగే ఈ శిక్షణ తరగతులకు ఆసక్తిగల విద్యార్థులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. గణితం, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టులపై నిపుణుల శిక్షణ లభించనుంది. పాఠ్యపరమైన శిక్షణకే పరిమితం కాకుండా మట్టితో బొమ్మలు తయారు చేయడం, కథలు చెప్పడం, రచనలు చేయడం, పేపర్లతో కళాకృతులు తయారు చేయడం వంటి సృజనాత్మక కార్యకలాపాలతో విద్యార్థుల ప్రతిభను వెలికితీయనున్నారు. వృత్తి ప్రాధాన్యంతో కూడిన శిక్షణ, సరదా ఆటలు, పాటల కార్యక్రమాలు శిబిరంలో అందించనున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం 7:30 నుంచి 11:30 గంటల వరకు విద్యార్థులకు జరిగే ఈ శిక్షణ తరగతులకు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు మాత్రమే ఈ ఉచిత శిక్షణకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు వేదిక అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు –94900 99991, కార్యదర్శి సామినేని శ్రీనివాసరావు –82470 01265, కోశాధికారి కేత రామబ్రహ్మం –98083 99169, కన్వీనర్ కల్లూరి శ్రీనివాసరావు –94926 15126కు సంప్రదించాలన్నారు.

దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయండి

ప్రత్యేక గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కోరిన ఎంఆర్‌పీఎస్ఎస్ నాయకులు, బాధితులు



ఫిర్యాదుతో కలెక్టర్ కార్యాలయం ముందు నాయకులు, బాధితులు

నరసరావుపేట: అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన కంభంపాటి విద్యాధర్ కుటుంబంపై అదే గ్రామానికి చెందిన వారు దాడిచేసిన సంఘటనపై అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుచేసి వెంటనే అరెస్టు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి(ఎంఆర్‌పీఎస్ఎస్) జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య మాదిగ, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాదు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదికకు బాధితులతో కలిసి హాజరై కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈనెల 15వ తేదీన ఈ సంఘటన జరగ్గా, వెంటనే స్థానిక పోలీసుకు ఫిర్యాదుచేసినా ఇప్పటివరకు ఫలితంలేదని అన్నారు. అందువలన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలతో అవస్థలు

పెదకూరపాడు: స్థానిక బీసీ(పాముల) కాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా సగభాగాన్ని వ్యాపారులు కొనుగోలు చేసిన ఇనుము, ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపేశారు. దీనివల్ల వాహనాలు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. కాలనీ ప్రజలు కూడా అవస్థలు పడుతున్నారు. ప్రధాన కాలచక్ర రోడ్డుకు అనుకొని ఉండటంతో ఈ రోడ్డులో బీసీ కాలనీ వాసులతో పాటు, ఎస్సీ కాలనీవాసులు తిరుగుతుంటారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి వేడుకలు

సత్తెనపల్లి: మండలంలోని పెదమక్కెనలో గల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో శనివారం మాస శివరాత్రి పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, భక్తులకు అన్నసంతర్పణ చేశారు.